క్లుప్తంగా

కుంటాల ఎస్సైగా అశోక్



కుంటాల: కుంటాల ఎస్సైగా సి.అశోక్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో దస్తురాబాద్ ఎస్సైగా పని చేయగా.. ఇక్కడ పని చేసిన ఎస్సై భాస్కరాచారి నిజామాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. నూతన ఎస్సైకి పలువురు స్వాగతం పలికారు.

నూతన కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గం

కుంటాల: మండల కేంద్రంలో ఆదివారం మున్నూరు కాపు సంఘం కుంటాల గ్రామ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా తోట రాఘవేందర్ మూడోసారి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా జక్కుల గజేందర్, ప్రధాన కార్యదర్శిగా మాగామ నాగరాజు, కోశాధికారిగా సీపతి వివేకానంద్ ఎన్నికయ్యారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని సభ్యులు పేర్కొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సన్మానించారు.

అనారోగ్యంతో రేషన్ డీలర్ మృతి



పోశెట్టి (ఫైల్)

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామానికి చెందిన మూడో రేషన్ దుకాణం నిర్వహించే డీలర్ ముద్రం పోశెట్టి (50) అనారోగ్యంతో ఆదివారం తన నివాసంలో మృతి చెందాడు. మృతుడి బంధువుల వివరాల ప్రకారం..పోశెట్టి క్యాన్సర్ బారిన పడి శస్త్రచికిత్స చేయించుకున్నాడు. మళ్లీ కణితి ఏర్పడటంతో వైద్యుల సూచన మేరకు ఇంటి వద్దే చికిత్స పొందుతున్నాడు. ఈక్రమంలో ఆరోగ్యం పూర్తిగా విషమించి ఉగాది పండుగ రోజునే కన్నుమూశాడు. మృతుడికి భార్య సునీత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న రితీశ్ రాథోడ్

ఖానాపూర్: పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ స్మారకార్థం బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రితీశ్ రాథోడ్ ప్రారంభించారు. నియోజకవర్గంతోపాటు ఉమ్మడి జిల్లా అభివృద్ధికి రాథోడ్ చేసిన కృషిని నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో అంకం మహేందర్, ఆకుల శ్రీనివాస్, కీర్తి మనోజ్, ఉపేందర్, బుచ్చన్న, రవీందర్‌రెడ్డి, భూమన్న, సంతోశ్, రమేశ్, నర్సయ్య తదితరులున్నారు.

క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఖానాపూర్: గోరు బోలి (లంబాడా) భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్‌నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకులు భుక్య గోవింద్‌నాయక్, జాదవ్ వెంకట్రావ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విభాగం జాతీయ అధ్యక్షుడు కొప్పుల రాజు, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు చిత్రపటాలున్న ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో చిన్నం సత్యం, నిమ్మల రమేశ్, గుగ్లావత్ రాజునాయక్, కదార్ల గంగనర్సయ్య, ప్రేసింగ్, జంగిలి శంకర్, జరుపు రాజేశ్వర్, రాము తదితరులు ఉన్నారు.

నేడు న్యూవెల్మల్‌లో వేలం

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామపంచాయితీ ఆధ్వర్యంలో ఉన్న ఆరు దుకాణ సముదాయాలకు సోమవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు గ్రామ ప్రత్యేకాధికారి రాజమల్లు, కార్యదర్శి భూపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. డీపీవో ఆదేశాల మేరకు పంచాయతీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు వేలం నిర్వహిస్తామని.. ఆసక్తి కలవారు రూ.రెండు వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

ఘనంగా ఉగాది వేడుకలు



భైంసారూరల్ : కామోల్‌లో పంచాంగం చదువుతున్న నరసింహారావు



ముధోల్‌లో పచ్చడి పంపిణీ చేస్తున్న నేతలు



సారంగాపూర్ : ఆలూరు రాజరాజేశ్వరస్వామి ఆలయంలో పంచాంగం వింటున్న భక్తులు



తానూరు: ఎల్విలో చేను వద్ద రైతులు



నిర్మల్‌లో నృత్యం చేస్తున్న యువతులు

జిల్లావ్యాప్తంగా విశ్వావసు నామ ఉగాది వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు రైతులు తెలుగు సంవత్సరంలో మొదటిరోజును మంచి ముహుర్తంగా భావించి చేన్ల వద్ద వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వివిధ ప్రాంతాల్లో ఉంటున్నవారు స్వగ్రామాలకు రావడంతో పల్లెలు సందడిగా మారాయి. అనంతరం షడ్రుచులతో తయారు చేసిన ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. ఆలయాల్లో వేదపండితులు పంచాంగ శ్రవణం విన్పించారు. నిర్మల్‌లోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో వెన్నెల డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో జానపద జాతర నిర్వహించగా.. దీనికి మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రేలారే రేలా ఫేం రవి బృందం ఆలపించిన జానపద గేయాలు ఆకట్టుకున్నాయి.

– సాక్షి నెట్‌వర్క్



కడెం: కొండుకూరులో కుడుకలపేర్లతో పిల్లలు



మామడ: పొన్కల్ వేంకటేశ్వరాలయంలో పంచాంగం వింటున్న గ్రామస్తులు



సోన్: న్యూవెల్మల్ హనుమాన్ ఆలయంలో..



లోకేశ్వరంలో పచ్చడి పంపిణీ చేస్తున్న భక్తులు



నిర్మల్‌లో గాయత్రి టౌన్‌షిప్‌లో ..



ఖానాపూర్‌లోని మహాలక్ష్మీ ఆలయం వద్ద..



లక్ష్మణచాంద: నర్సాపూర్‌లో చేను వద్ద యువ రైతు ఈశ్వర్



దిలావర్‌పూర్ నవాంజనేయస్వామి ఆలయం వద్ద..



కుభీర్‌లోని దొడర్నా తండాలో పనులు ప్రారంభిస్తున్న రైతులు

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే బొజ్జు

ఖానాపూర్: కులమతాలకు అతీతంగా పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని జామా మసీద్ ఆవరణలో జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యులు యూసుఫ్‌ఖాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే బొజ్జు పాల్గొని మాట్లాడారు. మన దేశం భిన్న సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమని పేర్కొన్నారు. అనంతరం రంజాన్ పండుగ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఈద్గా వద్ద ఏర్పాట్లు పరిశీలించారు. అంతకముందు ఉగాది సందర్భంగా శ్రీలక్ష్మీ వేంకటేశ్వర ఆలయంలో పూజలు చేశారు.

రామాలయంలో పారాయణం



పారాయణం చేస్తున్న భక్తులు

సారంగపూర్: శ్రీరామనవమి, హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మండలంలోని జామ్ గ్రామ పట్టాభి రామాలయంలో హనుమాన్ చాలీసా, రామనామ పారాయణం కార్యక్రమాలను ఆదివారం ఉగాది రోజున ఆలయ అభివృద్ధి కమిటీ, వీడీసీల ఆధ్వర్యంలో ప్రారంభించారు. ప్రతి శనివారం హనుమాన్ చాలీసా పారాయణం కొనసాగిస్తామని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామస్తులు, హనుమాన్ దీక్షాపరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో హెడ్గేవార్ జయంతి



కుభీర్‌లో మాట్లాడుతున్న రాజగోపాల్



కుంటాల: కల్లూర్‌లో..

కుభీర్: మండలకేంద్రంలోని మహాదేవ్ ఆలయ ఆవరణలో ఉగాది రోజైన ఆదివారం ఆర్‌ఎస్‌ఎస్ (రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్) వ్యవస్థాపకులు డాక్టర్ కేశవ్ బలిరామ్ హెడ్గేవార్ జయంతి నిర్వహించారు. దీనికి ముఖ్య వక్తగా ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ రాజగోపాల్ హాజరై మాట్లాడారు. ఆర్‌ఎస్ఎస్‌ను నాగపూర్‌లో ఐదుగురితో స్థాపించగా.. ప్రస్తుతం కోట్లాది మంది కార్యకర్తలు కల్గి ఉన్నారని పేర్కొన్నారు.ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు పోశెట్టి, నరేశ్, శ్రీనివాస్, గంగయ్య, వెంకటి తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: మండలకేంద్రంలోని శివాలయ ఆవరణలో ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకులు హెడ్గేవార్ జయంతి నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధి ధనుంజయ్, నాయకులు నాగేశ్వర్, శ్రీనివాస్, శ్రీధర్ ఉన్నారు.

కుంటాల: దేశప్రజలంతా ఐక్యంగా ఉండి జాతీయ భావం పెంపొందించుకోవాలని హిందు వాహిని సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కల్లూరు గ్రామంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కేశవ్ బలిరాం హెడ్గేవార్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హిందూ వాహిని సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పేదలకు చీరలు పంపిణీ

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ పంచాయతీ పరిధి గంగాయిపేట్ గ్రామంలో ఇటుక బట్టీల్లో పని చేసే 15 మంది నిరుపేద మహిళలకు పట్టణంలోని వాసవిక్లబ్ ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు జితేందర్, రవీందర్, సతీశ్, సుదర్శన్, జలేందర్, లక్ష్మీనారాయణ, వేణుగోపాల్, అశోక్, సాయిచరణ్, తదితరులు ఉన్నారు.

నిర్మల్‌లో చలివేంద్రం ప్రారంభం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఎస్.ఎస్ మెడికల్ దుకాణం వద్ద అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు మేడారం ప్రదీప్, నెల్ల అరుణ్, అయ్యప్ప సేవా సమితి సభ్యులు బద్రి శ్రీనివాస్, కనపర్తి విగ్నేష్, జాప ప్రకాష్, సాయన్న, సాదం ఆనంద్, గజేందర్, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేటితో ఎల్‌ఆర్‌ఎస్ గడువు పూర్తి

నిర్మల్: నేటితో ఎల్‌ఆర్‌ఎస్‌పై 25 శాతం రాయితీ గడువు పూర్తవుతుందని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని నర్సాపూర్(జి) ఎంపీఓ తిరుపతిరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో రూ. వెయ్యి చెల్లించి ఎల్ఆర్ఎస్ కొరకు దరఖాస్తు చేసుకున్న వారు అర్హులన్నారు. మండలంలో మొత్తం 163 దరఖాస్తులు వచ్చాయని, అందులో 56 మంది లబ్ధిదారులు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించడం ద్వారా రూ.9 లక్షల 60 వేల 757 ఆదాయం వచ్చిందని తెలిపారు. మిగతా 107 మంది ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రంజాన్‌కు ఏర్పాట్లు పూర్తి

తానూరు: రంజాన్ పురస్కరించుకొని మండలంలోని గ్రామాల్లో ఈద్‌గాంల వద్ద ఏర్పాటు చేశారు. గ్రామాల వారీగా పోలీస్ బందోస్తు ఏర్పాట్లు చేయనున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

క్రికెట్ పోటీలు

నిర్మల్: ఉగాది పండుగ సందర్భంగా నర్సాపూర్ (జి) మండలం తురాటి గ్రామంలో సట్ల చిన్నరాజు(దుబాయ్ రాజు) తన తండ్రి సట్ల భూమన్న జ్ఞాపకార్థం ఆదివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేతగా నిలిచిన జట్టుకు రూ.రెండు వేలు, రన్నరప్ జట్టుకు రూ.వెయ్యి అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు తదితరులున్నారు.

యువకుడికి సన్మానం

కుంటాల: మండలకేంద్రానికి చెందిన అరిగెల పండరి కుమారుడు అరుణ్ ఇటీవల అగ్నివీర్‌కు ఎంపికయ్యాడు. ఆదివారం కుంటాలలో రజకసంఘం సభ్యులు అరుణ్‌ను సన్మానించారు. పడకంటి దత్తాద్రి, అధ్యక్షులు గజేందర్, గజేందర్, రాజు, శంకర్, లక్ష్మణ్, సదాశివ్, తదితరులు పాల్గొన్నారు.

వీడీసీ సభ్యులకు సన్మానం

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులను ఆదివారం గ్రామస్తులు సన్మానించారు. మంద లింగన్న, అసిబొద్దీన్ పటేల్, నర్సాగౌడ్, ఆకుల భోజన్న, ప్రసాద్‌పటేల్, జంబుగ సాయన్న, సిడోల్ల ఓడ్డెన్న, సాయన్న, దేవిదాస్, నరేశ్, ఏరుల నవీన్, మందుల గంగాధర్‌ను సన్మానించారు.

'చావా'చిత్రం ప్రదర్శన

కడెం: మండలంలోని కొత్తమద్దిపడగలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం చావా చిత్రాన్ని పంచాయతీ కార్యాలయం ఎదుట భారీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. చిత్రాన్ని తిలకించేందుకు గ్రామస్తులు తరలివచ్చారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

ఖానాపూర్: రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఖానాపూర్ ఏఎంసీ డైరెక్టర్ దాత్రిక (ఆరె) గంగాధర్ అన్నారు. డైరెక్టర్‌గా నియమితులైన గంగాధర్‌ను ఆదివారం స్వగ్రామం గోడలపంపులో సన్మానించా రు. కరిపె శ్రీనివాస్, దాత్రిక లక్ష్మిపతిగౌడ్, రాజేందర్, రాజన్న, శ్యామ్, సుదర్శన్, నర్సయ్య, రమేశ్, రాజు, భరత్ తదితరులున్నారు.

ఆవిష్కరణ

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బాగులవాడ వాల్మీకినగర్‌మ సీతారామాలయంలో సీతారాముల కల్యాణ వేడుకల పోస్టర్‌ను ఆదివారం పూజారి రామానుజాచార్యులు ఆవిష్కరించారు. వచ్చే నెల 3న ధ్వజరోహణ కల్యాణం, పందిరి, 4న తలంబ్రాలు, పుస్తెలు తయారు చేయడం, 5న సీతా రాముల అలంకరణ, 6న సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ఖానాపూర్: మండలంలోని రంగపేట శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో వచ్చే నెల 6న నిర్వహించే సీతారామచంద్ర స్వామి కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికను ఆదివారం గ్రామస్తులు ఆవిష్కరించారు. రమణయ్య, యోగేశ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి పత్రికను గ్రామస్తులకు అందజేశారు.

రాములోరి కల్యాణానికి ఆహ్వానం



ఐకేరెడ్డికి ఆహ్వాన పత్రిక ఇస్తున్న గ్రామస్తులు

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లి రామాలయంలో ఈనెల 6న నిర్వహించే సీతారాములోరి కల్యాణానికి రావాలని కోరుతూ ఆదివారం మాజీ మంత్రి ఐకేరెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రిక అందించారు. ఆదివారం జిల్లాకేంద్రంలో రామాలయ కమిటీ ఆధ్వర్యంలో కలిశారు. డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు గంగారెడ్డి, గంగాధర్, మధు, సుదర్శన్, మహిపాల్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.


రజకసంఘం కార్యవర్గం



కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సభ్యులు

కుంటాల: మండలకేంద్రంలో ఆదివారం రజక సంఘ గ్రామ కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా ఎల్ద గజేందర్, ఉపాధ్యక్షుడిగా కాశీరాం గజేందర్, ప్రధాన కార్యదర్శిగా గడ్డపు గజేందర్, కోశాధికారిగా పడకంటి రాజు ఎన్నికయ్యారు. సంఘ సభ్యులు నూతన కార్యవర్గాన్ని సన్మానించారు.

భైంసారూరల్ ఎస్సైగా శంకర్



భైంసారూరల్: భైంసా రూరల్ ఎస్సైగా శంకర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు శంకర్ దస్తురాబాద్ ఎస్సైగా విధులు నిర్వహించగా బదిలీపై భైంసా రూరల్ ఎస్సైగా వచ్చారు. ఈసందర్భంగా సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలి



ప్రొసీడింగ్ కాపీ అందిస్తున్న ఎమ్మెల్యే రామారావు

భైంసాటౌన్: సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.50లక్షలు మంజూరైనట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం తన నివాసంలో పీఆర్‌టీయూ నాయకులకు ప్రొసీడింగ్ కాపీ అందజేశారు. అంతకుముందు పీఆర్‌టీయూ నాయకులు ఎమ్మెల్యేను కలిసి విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ రమణారావు, మండలాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, కృష్ణ, అబ్దుల్ అహాద్, నాయకులు గంగామోహన్, పుండ్లిక్, విశ్వనాథ్, గోపాల్, హైమద్ ఖాన్, కౌసర్ పాల్గొన్నారు.

శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం



పల్లకిలో ఉత్సవమూర్తులను తీసుకొస్తున్న భక్తులు

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీ సీతా రామాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విద్యానగర్ కాలనీలో సట్ల భీమక్క–నారాయణ దంపతుల నివాసం నుంచి ఉత్సవమూర్తి ప్రతిమలను ఆలయానికి పల్లకి సేవలో ఊరేగింపుగా తీసుకెళ్లారు. అర్చకులు కీర్తి రాఘవశర్మ ఆధ్వర్యంలో అఖండ జ్యోతి వెలిగించి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. రోడ్డు ఇలా.. రాకపోకలు ఎలా



తానూరు: మండలంలోని బోరిగాం ఎక్స్‌రోడ్డు నుంచి బెంబర గ్రామం వెళ్లే మార్గంలో ఉన్న బీటీ రోడ్డు కంకరతేలి గుంతలమయంగా మారింది. దీంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 12 ఏళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు వేడుకుంటున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: కమలాకర్, పీఆర్ డీఈ ఫోన్: 91211 35604

స్పర్శలేని మచ్చలుంటే వైద్యుల్ని సంప్రదించాలి

ఖానాపూర్: శరీరంపై స్పర్శలేని మచ్చలుంటే వైద్యుల్ని సంప్రదించాలని ఆశా వర్కర్లు పేర్కొన్నారు. పీహెచ్‌సీ అధికారుల ఆదేశాలతో మండలంలోని గ్రామాల్లో ఆశావర్కర్లు కుష్ఠు వ్యాధి గ్రస్తులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే చేస్తున్నారు. వ్యాధి లక్షణాలు, రోగనిర్ధారణ, వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అందించే మందుల వివరాలను ప్రజలకు వివరిస్తున్నారు. ఆశావర్కర్లు గంగామణి, విజయలక్ష్మి, వెరోనికా తదితరులు ఉన్నారు.

బాబాపూర్‌లో ఇఫ్తార్

లక్ష్మణచాంద: మండలంలోని బాబాపూర్ మసీదులో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు ఒ డ్వాల రాజేశ్వర్, మాజీ సర్పంచ్‌లు బిట్లింగ్ నారా యణ, తునికి నారాయణ, నాయకులు గంగాధర్ గౌడ్, ప్రభాకర్, సురేశ్ పాల్గొన్నారు.